క్లుప్తంగా

కామర్స్ విద్యార్థులకు ఎక్కువ అవకాశాలు

తిరుపతి ఎడ్యుకేషన్ : కామర్స్ విభాగంలో పీజీ చేసిన విద్యార్థులకు వివిధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని ఏపీఎస్పీడీసీఎల్ ఫైనాన్స్ విభాగపు డైరెక్టర్ వీఎస్.బాబు తెలిపారు. ఎస్వీయూలోని కామర్స్ విభాగంలో సోమవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి అనుకున్న లక్ష్యాన్ని అధిరోహించాలని తెలిపారు. చదువుతో పాటు నైపుణ్య సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. క్యాంపస్ సెలక్షన్స్‌ను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం ఏపీఎస్పీడీసీఎల్ ఫైనాన్స్ విభాగపు డైరెక్టర్ వీఎస్.బాబు ప్రొఫెసర్లు ఘనంగా సత్కరించారు. ఎస్వీయూ కామర్స్ విభాగాధిపతి వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్లు ఎం.రాజశేఖర్, మోహన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, అకడమిక్ కన్సల్టెంట్లు మణెయ్య, మల్లేశ్వరి, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

రుయాకు ప్రింటర్ వితరణ



తిరుపతి తుడా : తిరుపతి రుయా ఆసుపత్రి టీబీ విభాగానికి రూ.20 వేల ప్రింటర్‌ను ఎన్ఆర్ఐ చిన్నిమినేని కిశోర్, యువతేజ సోమవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ వర్కింగ్ చైర్మన్ చినబాబు ద్వారా వితరణ చేశారు. వారిని వైద్యాధికారులు అభినందించారు.

మాదిగ కమ్యూనిటీ భవన్ స్థలాన్ని పరిరక్షించండి

తిరుపతి కల్చరల్: ఆటోనగర్‌లో ప్రభుత్వం కేటాయించిన మాదిగల కమ్యూనిటీ భవన్ స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి పరిరక్షించాలని మాదిగ దండోరా తిరుపతి డివిజన్ అధ్యక్షుడు ఏఎస్.శంకర్‌రావు కోరారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్ లో విలేకరులతో మాట్లాడారు. 2005లో ఎస్సీల కోసం క్రిష్ణారెడ్డి నగర్, ఆటోనగర్‌లో అక్కారంపల్లి పరిధిలోని సర్వేనెంబర్ 74/5ఏలో 20 సెంట్ల స్థలాన్ని మంజూరుకు అప్పటి చిత్తూరు జిల్లా కలెక్టర్ అనుమతి ఇచ్చారని పేర్కొన్నారు. అందులో నాగేశ్వరరావు అనే వ్యక్తి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నాడని తెలిపారు. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లడంతో కట్టడాలు ఆపాలని హెచ్చరించినా ఫలితం లేదన్నారు. దీనిపై స్పందనలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశామని తెలిపారు. అధికారులు స్థలాన్ని కాపాడాలని, లేనిపక్షంలో ఈ నెల 10వ తేదీన తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని తెలియజేశారు.

శివాజీకి ఘన నివాళి



చత్రపతికి నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుపతి గాంధీ రోడ్: మొగల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన భారత ముద్దుబిడ్డ చత్రపతి శివాజీ వర్ధంతిని సోమవారం బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. జీఎస్ మాడ వీధిలో శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు అక్కినపల్లి మునికృష్ణ యాదవ్, సుబ్రహ్మణ్యం యాదవ్, చంద్రబాబు యాదవ్, సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

మార్కెట్ గురవారెడ్డికి సత్కారం



గురవారెడ్డిని సత్కరిస్తున్న మార్కెట్ కమిటీ నేతలు, సభ్యులు

తిరుపతి కల్చరల్: తిరుపతి కూరగాయల మార్కెట్ కమిటీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నేత గురవారెడ్డిని సోమవారం రాత్రి కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆయన జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కౌన్సిలర్ దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, పదవ డివిజన్ అధ్యక్షుడు రూపేష్‌రెడ్డి, ట్రేడ్ యూనియన్ నాయకులు తిరుమలరెడ్డి, ఇమ్రాన్, విజయ్‌రెడ్డి, రాజేష్, మురళి, మోహన్ పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సులకు డీఈవోలుగా తాత్కాలిక విధులు

తిరుపతి తుడా: తిరుపతి రుయాలోని ఏడుగురు స్టాఫ్ నర్సులకు డీఈవో (డేటా ఎంట్రీ ఆపరేటర్) లుగా తాత్కాలిక విధులు కేటాయిస్తూ సూపరింటెండెంట్ నాగమునీంద్రుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రుయాలో డీఈవోల నియామకం ఆలస్యమైంది. గత సూపరింటెండెంట్ ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే తొలగించిన ఆపరేటర్లలో తనకు అనుకూలమైన ముగ్గురితో అనధికారికంగా పనిచేయించారు. వారు ఆరోగ్యశ్రీ ఆసరా డబ్బుల స్కామ్‌లో ప్రధానంగా నిలిచారు. వారిపై అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ఆరోగ్యశ్రీ రోగుల వివరాలు నమోదు ఆలస్యం కాకుండా ఏడుగురు స్టాఫ్ నర్సులకు డీఈవోలుగా తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. దీనిపై స్టాఫ్ నర్సులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రుయా సూపరింటెండెంట్ స్పందిస్తూ డీఈవోల నియామకాల కోసం కలెక్టర్‌కు విన్నవించినట్లు చెప్పారు. నియామక ప్రక్రియ ఆలస్యం కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న స్టాఫ్ నర్సులతో ఆరోగ్యశ్రీ రోగులకు సేవ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు.

వైభవంగా తెప్పోత్సవాలు ప్రారంభం

- తెప్పపై ఐదు చుట్లు తిరిగిన సీతాలక్ష్మణ సమేత కోదండ రాముడు
- కర్పూర నీరాజనాలు పలికిన భక్తులు



తెప్పపై విహరిస్తున్న సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామివారి తెప్పోత్సవాలు సోమవారం రాత్రి రామచంద్ర పుష్కరిణిలో వైభవంగా ప్రారంభమయ్యాయి. విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై సీతాలక్ష్మణ సమేత రామచంద్రమూర్తి ఆశీనులై పుష్కరిణిలో విహరించారు. స్వామి వారు తెప్పలపై ఐదు చుట్లు తిరిగి భక్తులను కటాక్షించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని కర్పూర నీరాజనాలు సమర్పించారు.

ఘనంగా ఖనిజం తోట ఉత్సవం

కోదండరామస్వామి ఖనిజం తోట ఉత్సవం సోమవారం సాయంత్రంగా ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా కోదండరాముని బ్రహ్మోత్సవాల అనంతరం ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. పూర్వం గోవిందరాజస్వామి ఆలయం వెనుకనున్న పాత హుజూర్ ఆఫీసులో ఉండే దిగుడు బావిలో సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి స్నపన మంజనం జరిగేది. దీనికి గుర్తుగా ఆ సాయంత్రం గోవిందరాజ స్వామి ఆలయ ప్రదక్షిణగా ఊరేగింపు చేస్తారు. అనంతరం కోదండరామస్వామి ఆలయం చేరుకుంటారు. ఈ ఉత్సవంలో భాగంగా సోమవారం ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం 4 గంటలకు శ్రీరాముల వారు ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి గోవిందరాజస్వామి ఆలయ వాహన మండపానికి చేరుకున్నారు. అక్కడ అర్చకులు శాస్త్రోక్తంగా ఆస్థానం నిర్వహించారు. స్వామి వారు అక్కడి నుంచి బయలుదేరి శ్రీరామచంద్ర పుష్కరిణికి చేరుకుని తెప్పలై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు మారుతీ ప్రసాద్, ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం



తువ్వచేనుపల్లిలో సీసీరోడ్డుకు భూమిపూజ చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- రూ.30 లక్షలతో సీసీ రోడ్డుకు భూమిపూజ

చంద్రగిరి: నియోజకవర్గంలోని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పనపాకం పంచాయతీ తువ్వచేనుపల్లి, గడ్డకిందపల్లి, తూర్పుపల్లి, అమాసవారిపల్లిలో జాతీయ రహదారి నుంచి వెళ్లే మట్టిరోడ్లను సిమెంటు రోడ్లుగా మారుస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రూ.30 లక్షలతో తువ్వచేనుపల్లిలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. దీంతో స్థానికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అనేక ఏళ్లుగా మట్టి రోడ్డుతోనే ఇబ్బంది పడుతున్నామని, ఇప్పుడు సీసీ రోడ్డు వేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చొరవతో తమ గ్రామానికి సీసీ రోడ్లు వచ్చాయన్నారు. అనంతరం స్థానిక నాయకులు ఎంపీపీ మోహిత్ రెడ్డికి గ్రామస్తులను పరిచయం చేశారు. అంతకముందు ఆయన పనపాకంలో నూతనంగా నిర్మించిన శ్రీవర సిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ధర్మకర్త రెడ్డెప్ప శాలువాతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

చంద్రగిరి: చిరుధాన్యాలను ప్రతి రోజూ ఆహారంగా తీసుకోవడం ద్వారా తల్లులు, పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ ప్రదీప తెలిపారు. మండలంలోని తొండవాడలో సోమవారం వైస్ ఎంపీపీ నిరంజన్ కుమార్ అధ్యక్షతన పోషణ్ పక్వాడ ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ చిరుధాన్యాల్లో అనేక పోషకాలు దాగి ఉన్నాయని వివరించారు. రాగులు, సజ్జలు, సామలు, కొర్రలతో చేసిన వంటలను తినిపించడం ద్వారా పిల్లల్లో శారీరక ఎదుగుదల బాగుంటుందని తెలిపారు. అనంతరం ఆరోగ్యంగా ఉన్న చిన్నపిల్లలను గుర్తించి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్లో ఏర్పాటు చేసిన పిండి పదార్థాలను బాలింతలకు అందజేశారు. సూపర్‌వైజర్లు నాగమణి, సుహాసిని, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి, గంగమణి, ప్రభావతి, మల్లీశ్వరి, మణిజ్యోతి, పద్మజ పాల్గొన్నారు.



పోషణ్ పక్వాడలో మాట్లాడుతున్న సీడీపీఓ ప్రదీప

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ

ఎర్రావారిపాళెం(తిరుపతి రూరల్): ఎర్రావారిపాళెంలోని పలు పీహెచ్‌సీల్లో సోమవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. నెరబైలులోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్యకరమైన శిశువులకు బహుమతులు ప్రదానం చేశారు. వైఎస్సార్ పోషణ కార్యక్రమం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆరోగ్య విస్తరణాధికారి నరసింహప్రసాద్, పాల్గొన్నారు.

శ్రీనివాసనగర్‌లో తీరిన నీటి సమస్య

పాకాల : మండలంలోని ఇరంగారిపల్లి పంచాయతీ శ్రీనివాస నగర్‌లో సోమవారం బోరు వేశారు. నీరు పడడంతో తాగునీటి సమస్య తీరిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ తమ గ్రామంలో తాగునీటి సమస్య ఉందని తిరుపతి రూరల్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి తెలిపామన్నారు. ఆయన అధికారులతో మాట్లాడి బోరు వేయించడంతో సమృద్ధిగా నీరు పడిందని తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్య ఉండదని తెలిపారు. తమ సమస్యలపై తక్షణం స్పందించిన మోహిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆక్రమణలను ఉపేక్షించొద్దు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని మేయర్ శిరీష అధికారులను ఆదేశించారు. ఆమె సోమవారం డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కమిషనర్ అనుపమ అంజలితో కలిసి స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్షించారు. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ మాట్లాడుతూ ప్రజ సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల వద్ద మ్యాన్ హోల్ ఓవర్ ఫ్లో సమస్యను ఎన్నిసార్లు చెప్పినా పరిష్కరించలేదని, ఎస్‌టీవీ నగర్, బైరాగిపట్టెడ, ఏఐఆర్ బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో కాలువలపై స్లాబులు నిర్మించాలని ఆదేశించినా ఇంజినీర్లు పట్టించుకోలేదని మండిపడ్డారు. కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని ఇంజినీర్లను ఆదేశించారు. ఉప్పంగి హరిజనవాడ వద్ద రోడ్డు స్థలాన్ని ఆక్రమించి దుకాణం ఏర్పాటు చేయడంతో వాహన, పాదచారులు ఇబ్బంది పడుతున్నారన్న ఫిర్యాదుపై స్పందిస్తూ తక్షణమే ఆ షాపును తొలగించాలన్నారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రోడ్లపై ఉన్న తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ తిరుమాలిక మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలకు కేరాఫ్ టీడీపీ



మాట్లాడుతున్న జేసీఎస్ బాలిశెట్టి కిషోర్

తిరుపతి కల్చరల్: హత్యా రాజకీయాలకు కేరాఫ్ తెలుగుదేశం పార్టీ అని జేసీఎస్ అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, వైఎస్సార్ సీపీ యువజన నేత పసుపులేటి సురేష్, టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ వాసుయాదవ్ ఆరోపించారు. వారు సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నాగరాజు హత్య కేసులో టీడీపీ సర్పంచ్‌తోపాటు ఆ పార్టీ నేతల ప్రమేయం ఉందని పోలీసుల విచారణలో తేటతెల్లం కానుందని తెలిపారు. ప్రధాన నిందితుడు చాణిక్య ప్రతాప్ మాజీ ఎమ్మెల్యే బంధువని ఆరోపించారు. దీన్నిబట్టి చూస్తే నిందితుడికి టీడీపీ మాజీ ఎమ్మెల్యే షెల్టర్ ఇచ్చారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. తలెత్తుతున్నాయన్నారు. హత్యపై టీడీపీ నేతలు మౌనం వహించడం విడ్డూరమన్నారు. ప్రశాంతమైన తిరుపతిలో ఇలాంటి సంఘటలకు పాల్పడే వారికి ప్రజలు గుణపాఠం చెప్పే రోజు త్వరలోనే వస్తుందని హెచ్చరించారు. బాధితులకు తాము అండగా నిలిచి టీడీపీ గుండాలకు శిక్షణ పడే వరకు పోరాటంచేస్తామని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు ఉదయ్ వంశీ, మద్దాల శేఖర్, సుబ్బు, కార్పొరేటర్ నరేంద్ర పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి

భాకరాపేట : మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని చిన్నగొట్టిగల్ల ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం ఇంజినీర్లు, సచివాలయ ఇంజినీర్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 13 పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వాటికి దశల వారీగా బిల్లులు చేయాలని ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలను పాటించాలని కోరారు. ఎంపీడీవో దేవేంద్రబాబు, పంచాయతీ రాజ్ ఏఈ రాజాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

అన్నమాచార్యలో అంతర్జాతీయ సదస్సు



అంతర్జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కరకంబాడి రోడ్డు లోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎమెర్జింగ్ ట్రెండ్స్ ఇన్ ఇంజినీరింగ్ (ఐసీటీఈఎస్ఎం–2కే23) అనే అంశంపై రెండు రోజులు నిర్వహించనున్న 5వ అంతర్జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా శాంసంగ్ సంస్థ కంప్యూటర్ విజన్ సైంటిస్ట్ డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. తిరుపతి ఐబీటీ ప్రతినిధి డాక్టర్ కేపీ నవీన్ 5జీ టెక్నాలజీ, వైఫైపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ సి.నాదమునిరెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సుకు 300 మందికి పైగా పరిశోధన పత్రాలు వచ్చాయని తెలిపారు.

హనుమంతుడిపై కోదండరాముడి విహారం



హనుమంత వాహనంపై దర్శనమిస్తున్న కోదండరామస్వామి

చంద్రగిరి: పట్టణంలోని టీటీడీ అనుబంధ కోదండ రామస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం స్వామి వారు హనుమంత వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామి, అమ్మవార్లను మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణలో స్నపన తిరుమంజనం, సాయంత్రం యాగశాల కార్యక్రమాలు చేశారు. రాత్రి 7.30 గంటలకు స్వామివారు హనుమంత వాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు.

అంతర్జాతీయ సంస్థలతో సత్సంబంధాలు అభినందనీయం



మాట్లాడుతున్న మహిళా వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ కే.రాజారెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : బోధన, పరిశోధనా రంగాల్లో విద్యార్థులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణకు అంతర్జాతీయ సంస్థలతో పద్మావతి మహిళా వర్సిటీ సత్సంబంధాలు అభినందనీయమని ఇన్‌చార్జ్ వీసీ కె.రాజారెడ్డి తెలిపారు. వర్సిటీ వ్యాపార నాయకత్వ విభాగం, అంతర్జాతీయ వ్యవహారాల కేంద్రం సంయుక్తంగా శాస్త్రి ఇండో కెనడియన్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో రెండు వారాలు బోధన, పరిశోధన, వివిధ యాజమాన్య విషయాలు, మానవ వనరుల అభివృద్ధి శిక్షణ తదితర కార్యక్రమాలపై అధ్యాపకులు, విద్యార్థినులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. వాటిని వీసీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ సంస్థలతో ఎంఓయూ కుదుర్చుకుంటే అభివృద్ధి పథంలో పయనించవచ్చని అభిప్రాయపడ్డారు. రిజిస్ట్రార్ ఎస్.రజని మాట్లాడుతూ న్యాక్, నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా అంతర్జాతీయ సంస్థలతో నిర్వహిస్తున్న బోధన, శిక్షణ, అవగాహన కార్యక్రమాలను విద్యార్థినులు, అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కెనడియన్ విజిటింగ్ ప్రొఫెసర్ బెండ స్ట్రోక్స్ మాట్లాడుతూ విద్యార్థులకు బిజినెస్ అనలిటిక్స్, డెసిషన్ మేకింగ్, మానవ వనరుల అభివృద్ధి శిక్షణ కార్యక్రమాల్లో నిజజీవితంలో ఉపయోగపడేలా శిక్షణ సౌకర్యాలు, అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తాను రిసోర్స్ పర్సన్‌గానే కాకుండా ఓ విద్యార్థిగా భారతదేశంలోని నైతిక విలువలు, సాంఘిక, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించుకోవాలనే ఉద్దేశంతో ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు.

కార్యక్రమంలో సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ డీన్ కె.అనురాధ, అంతర్జాతీయ వ్యవహారాల కేంద్రం డీన్ పి.విజయలక్ష్మి, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శ్రీరజని పాల్గొన్నారు.

6 నుంచి ఎర్రావారిపాళెంలో మోహిత్‌రెడ్డి పాదయాత్ర



నెరబైలులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎర్రావారిపాళెం(తిరుపతి రూరల్): వైఎస్సార్ సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి 6వ తేదీ నుంచి ఎర్రావారిపాళెం మండలంలో పర్యటించనున్నారు. 12 పంచాయతీల్లో దాదాపు 15 రోజులు ఆయన గడప గడపకూ వెళ్లి ప్రజలతో మాట్లాడతారు. జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులను వివరించనున్నారు. మండలంలోని యల్లమందలో ఈ నెల 6న ప్రారంభమయ్యే ఈ పాదయాత్ర ఉస్తికాయలపెంట, కోటకాడపల్లి, బోడేవాండ్లపల్లి, వీఆర్ అగ్రహారం, కూరపర్తివారిపల్లి, నెరబైలు, చింతకుంట, కమళ్ల, ఎర్రావారిపాళెం, చెరుకువారిపల్లి, ఉదయమాణిక్యం పంచాయతీల్లో ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈనేపథ్యంలో ఆయా పంచాయతీల్లో ఏర్పాట్లను వైఎస్సార్ సీపీ నాయకులు చెవిరెడ్డి రఘునాథరెడ్డి, జెడ్పీటీసీ కరుణాకరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాగర్జునరెడ్డి, నాయకులు చెంగల్‌రెడ్డి, హరినాథరెడ్డి, బాలాజీ, వైస్ ఎంపీపీ నాగేశ్వరరావు, సర్పంచులు మధుసూదనరెడ్డి, రమణయ్య, రమణారెడ్డి, నాగలేషు, రమేష్, దేవేంద్ర, ఎంపీటీసీలు సుధాకర్‌రెడ్డి, పరంధామయ్య, మహేశ్వరరెడ్డి పరిశీలించారు.

రేపు బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

తిరుపతి కల్చరల్: బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను బుధవారం కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించనున్నట్లు బాబు జగ్జీవన్‌రామ్ మెమోరియల్ భవన్ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లాని బాబు, జి.వెంకటరత్నం తెలిపారు. వారు సోమవారం ప్రెస్‌క్లబ్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ బైరాగిపట్టెడలోని పార్క్ వద్దనున్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పూలమాలలు సమర్పిస్తామని తెలిపారు. అనంతరం బాబు జగ్జీవన్‌రామ్ మెమోరియల్ భవన్‌లో వేడుకలు చేపడతామన్నారు. ఇందులో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ ఎం.గురుమూర్తి, మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయ్‌రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొంటారని తెలిపారు. కమిటీ గౌరవాధ్యక్షులు టి.దాస్, మోహన్‌రాజ్, కోశాధికారి ఆర్.ప్రసాద్‌బాబు, గంగులయ్య, కుమార్, రాజు, ఏఎస్.శంకర్‌రావు, ముకుంద, సురేష్, మధు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

భాకరాపేట : తిరుపతి బైరాగపట్టెడలోని బాబు జగ్జీవన్‌రామ్ భవనంలో బుధవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గురుశంకర్‌ప్రసాద్ కోరారు. ఆయన సోమవారం చిన్నగొట్టిగల్లులో కరపత్రాలను విడుదలు చేశారు. వెంకటరమణ, రామచంద్రయ్య, నాగులయ్య, దళిత నాయకులు నాగయ్య, సహదేవయ్య, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆది నుంచి బీసీలపై టీడీపీ కక్షసాధింపు

- వడ్డెర యువకుడిని సజీవ దహనం చేయడం దారుణం
- నిందితులను కఠినంగా శిక్షించాలి
- దళిత, బహుజనులతో కలిసి రాష్ట్ర వ్యాప్త నిరసన
- వడ్డెర నాయకుల హెచ్చరిక



నిరసన తెలుపుతున్న వడ్డెర సంఘం రాష్ట్ర డైరెక్టర్ మురగయ్య, మనోహర్, దామోదరం

చంద్రగిరి: టీడీపీ నాయకులు మొదటి నుంచి బీసీలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురగయ్య ఆరోపించారు. ఆ సంఘం నాయకులు సోమవారం మృతుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నాగరాజు కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. టీడీపీ నాయకుల ఆగడాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న సీఐ ఓబులేశు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. నిందితులను త్వరలోనే పట్టుకుని చట్ట ప్రకారం శిక్షిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మురగయ్య మాట్లాడుతూ గొడవలు జరుగుతున్న నేపథ్యంలో టీడీపీ నాయకులు చాణక్య ప్రతాప, ఆయన తమ్ముడు రింపుజయ రాజీ చేస్తామని పిలిచి నాగరాజును సజీవ దహనం చేశారని మండిపడ్డారు. ఆ గ్రామంలో వడ్డెర కులస్తు నాలుగు ఇళ్లు మాత్రమే ఉన్నాయని, దీంతో టీడీపీ నాయకుల ఆగడాలకు అంతులేకుండా పోయిందన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి కూడా తీసుకెళ్తామన్నారు. టీడీపీ నాయకుల దాడులకు నిరసనగా రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షుడితో చర్చించి రాష్ట్ర వ్యాప్తంగా నిరసలకు దిగుతామని స్పష్టం చేశారు. డీజీపీ చొరవ తీసుకుని నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా దళిత ఫెడరేషన్(ఏఐడీఆర్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు దామోదరం మాట్లాడుతూ బహుజనులు, దళితులను టీడీపీ నాయకులు చులకనగా చూస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వడ్డెర రాష్ట్ర డైరెక్టర్ మనోహర్, జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్, ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి

భాకరాపేట : మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని చిన్నగొట్టిగల్ల ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం ఇంజినీర్లు, సచివాలయ ఇంజినీర్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 13 పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వాటికి దశల వారీగా బిల్లులు చేయాలని ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలను పాటించాలని కోరారు. ఎంపీడీవో దేవేంద్రబాబు, పంచాయతీ రాజ్ ఏఈ రాజాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌కే అబాకస్ 11వ వార్షికోత్సవం

– విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్ల ప్రదానం



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఆర్‌కే అబాకస్ విద్యా సంస్థల 11వ వార్షికోత్సవాన్ని సోమవారం స్థానిక యూత్ హాస్టల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 5 స్థాయిల్లో అబాకస్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు నగదు బహుమతి, పతకాలు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆర్‌కే అబాకస్ సంస్థ అధినేత ఆర్‌కే రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో ర్యాంకుల సాధనకు అబాకస్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు లెక్కలు వేగంగా చేయగల సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. శ్రద్ధను, ఏకాగ్రతనూ పెంచడం కోసం కొన్ని మెదడుకు సంబంధించిన ఎక్సర్‌సైజ్‌లు కూడా నేర్పుతామని తెలిపారు. క్షణకాలంలో కంప్యూటర్ కంటే వేగంగా చేసే పిల్లలను చూసి అతిథిగా విచ్చేసిన నలంద హైస్కూల్ అధినేత ఓబుల వెంకటరమణారెడ్డి ఆనందించారు. మరో విశిష్ట అతిథి గగన్ స్కూల్ అధినేత కానాల సురేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలు చిన్నతనం నుంచి గణిత సూత్రాలు, వేదగణితం, నియమ నిబంధనలు అలవర్చుకుంటే ఏదైనా సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రైవేటు విద్యాసంస్థల అధినేతలు, పలువురు ప్రముఖులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

16న చలో విజయవాడ

తిరుపతి కల్చరల్: విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన క్షేత్రంలో ఈ నెల 16వ తేదీన నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సదస్సు సందర్భంగా చలో విజయవాడ కార్యక్రమం చేపట్టినట్టు జై భారత్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, పోరాట సంస్థల ఐక్య వేదిక జాతీయ కార్యదర్శి లోకనాథం తెలిపారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కుల నిర్మూలన, అసమానతల అంతం, సామాజిక న్యాయ సాధన కోసం నిరంతరం నిబద్ధతతో ఉద్యమిస్తున్న సంస్థ జై భారత్ అని తెలిపారు. జై భారత్ సామాజిక విప్లవ రణభేరి పేరున రాష్ట్ర సదస్సు చేపడుతున్నట్లు తెలిపారు. జై భారత్ జాతీయ ఉపాధ్యక్షుడు చోడవరం వంశీ, విజయ్, మహేష్ పాల్గొన్నారు.